## ప్రజలకు దసరా శుభాకాంక్షలు

### వైఎస్సార్ సీపీ నేత ఈవూరు గణేశ్



**రేపల్లె రూరల్:** ప్రజలకు వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి ఈవూరు గణేశ్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. చెడుపై మంచిదే ఎప్పుడూ విజయమని, దానికి కాస్త సమయం పడుతుందని, మహిషాసురుడిపై దుర్గమ్మ పోరాడి విజయం సాధించారని వివరించారు. ప్రతి ఒక్కరూ మంచిబాటలో పయనిస్తూ సుఖశాంతులతో, పాడిపంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## 12 మద్యం దుకాణాలకు 131 దరఖాస్తులు

**రేపల్లెరూరల్:** మద్యం షాపుల కోసం దరఖాస్తుల ప్రక్రియ ముగిసినట్టు రేపల్లె ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఆర్.దివాకర్ చెప్పారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన దరఖాస్తుల వివరాలు వెల్లడించారు. తమ పరిధిలోని రేపల్లె, రేపల్లె రూరల్, భట్టిప్రోలు మండలాలకు సంబంధించి 12 దుకాణాలకు 131 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. రేపల్లె పట్టణంలో 3 దుకాణాలకు 42 దరఖాస్తులు, రేపల్లె మండలంలోని 4 దుకాణాలకు 37 దరఖాస్తులు, భట్టిప్రోలు మండలంలోని 5 దుకాణాలకు 52 దరఖాస్తులు అందాయని వివరించారు. బాపట్లలో సోమవారం కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిలో షాపుల కేటాయింపు జరుగుతుందని వివరించారు.

## వైభవంగా నాంచారమ్మ విగ్రహ ప్రతిష్ఠ



**దమ్మనవారిపాలెం(కర్లపాలెం):** గ్రామ దేవత నాంచారమ్మ విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. దమ్మనవారిపాలెంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో హోమాలు, శాంతి పూజలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గురపుసాల వెంకటేశ్వరమ్మ, మాడసాని మునలయ్య, అలపర్తి సాంబశివరావు, ఇమడా బత్తుని నరసయ్య, శ్రీనివాసరావు, హనుమంతరావు, బాలాజీ, భక్తులు తదితరులు ఉన్నారు.


## మహిళ అదృశ్యంపై కేసు

**కొల్లూరు :** కంప్యూటర్ క్లాస్‌కు అని చెప్పి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని చింతర్లంకలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. చింతర్లంకకు చెందిన ఓ యువతి డిగ్రీ పూర్తి చేసిన అనంతరం రోజూ బస్సులో తెనాలిలో కంప్యూటర్ తరగతులకు వెళ్లి వస్తుంది. ఈనెల 8న కంప్యూటర్ తరగతులకు అని వెళ్లిన యువతి తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువుల వద్ద, చుట్టు పక్కల ప్రాంతాలలో వెతికారు. యువతి ఆచూకీ దొరకకపోవడంతో యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ జి.ఏడుకొండలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





వెల్లటూరులో బతుకమ్మకు పూజలు చేస్తున్న మహిళలు



చుండూరు మండలం మోదుకూరులో అమ్మవారి అలంకారం



అడవులదీవిలో మహిషాసురమర్దిని అలంకరణ



పిట్టుకోటిరెడ్డిపాలెంలో రాజరాజేశ్వరి గుడిలో కుంకుమార్చనలో మహిళలు

## జయహో దుర్గాభవానీ

దసరా నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. శుక్రవారం తొమ్మిదోరోజు అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మ దివ్య మంగళ స్వరూపాన్ని భక్తులు కనులారా తిలకించి పులకించారు. పలు చోట్ల ప్రత్యేక హోమాలు, అన్నదానాలు నిర్వహించారు. కొన్నిచోట్ల అమ్మవారి ప్రతిమలను నిమజ్జనం చేశారు.

భట్టిప్రోలు/వేమూరు/నిజాంపట్నం/చెరుకుపల్లి/రేపల్లె రూరల్/కొల్లూరు/నగరం



రేపల్లెలో మహిషాసుర మర్దినిగా బూరుగులమ్మ



కొల్లూరులో నిమజ్జనానికి తరలిస్తున్న అమ్మవారి ప్రతిమ

## మోదుకూరులో పోలీస్ బందోబస్తు



**మోదుకూరు(వేమూరు) :** మోదుకూరులో కనక దుర్గ ఆలయం వద్ద దసరా ఉత్సవాల దృష్ట్యా బందోబస్తు పటిష్టం చేసినట్టు రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరరావు తెలిపారు. చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలో శుక్రవారం ఆయన గ్రామస్తులతో సమావేశమయ్యారు. గొడవలు లేకుండా ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చుండూరు సీఐ శ్రీనివాసరరావు, ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



దుర్గాప్రసాద్ (ఫైల్)

**నగరం:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం మండలంలోని తాడివాకవారిపాలెంలో జరిగింది. ఎస్ఐ బండ్ల భార్గవ్ సమాచారం మేరకు నగరం–బాపట్ల రహదారిలో తాడివాకపాలెం వద్ద తాడివాక దుర్గాప్రసాద్ (41) తన పొలంలో కలుపు మొక్కలను కూలీల చేత తీయిస్తూ రహదారి మార్జిన్‌లో కూర్చుని ఉన్నాడు. బాపట్ల నుంచి నగరం వస్తున్న ద్విచక్ర వాహనం అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో దుర్గాప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను నగరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దుర్గా ప్రసాద్ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుని భార్య దీపిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. దుర్గాప్రసాద్ మృతదేహానికి పోలీసులు పంచనామా చేసి పోస్ట్‌మార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



## 'ముంపు'తిప్పలు

- చిన్న వానకే మునుగుతున్న కళాశాలలు
- విద్యార్థులు, అధ్యాపకుల అవస్థలు
- నీటిలోనే రాకపోకలు
- క్షీణిస్తున్న పారిశుద్ధ్యం
- వ్యాపిస్తున్న దుర్గంధం



ఏబీఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో నిల్వ ఉన్న నీటిలో పేరుకుపోతున్న పాకుడు

**రేపల్లె రూరల్:** పాలకుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. చిన్నపాటి వర్షానికే పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాలలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో అధ్యాపకులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భవనాలు, వాటి ప్రాంగణాలు పల్లపు ప్రాంతాలు కావడంతో రోజుల తరబడి నీరు నిలిచిపోతోంది. నీరు పోయే మార్గం లేకపోవడంతో నిల్వ ఉండటంతో పారిశుద్ధ్యం క్షీణించి ఆ ప్రాంతాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. నీటిలో పాకుడు, పసర పేరుకుపోయి భరించలేని వాసన వస్తోంది. నీటిలోనే అధ్యాపకులు, విద్యార్థులు కళాశాలలకు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. దుర్గంధంతో తరగతుల నిర్వహణ కష్టమవుతోందని అధ్యాపకులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**క్రీడలకు ఆటంకం**

ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణాలలో విశాలమైన ఆటస్థలం ఉండడంతో సెలవు దినాలు, పండుగ రోజుల్లో వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో ఇక్కడికి చేరుకొని సరదాగా ఆడుకుంటారు. క్రికెట్, షటిల్, కబడ్డీ, వాలీబాల్ వంటి ఆటలను ఆడుకుంటూ తర్ఫీదు పొందుతూ ఉంటారు. నెల రోజుల నుంచి విడతల వారీగా కురుస్తున్న వర్షంతో మైదానాల్లో నీరు చేరడం వల్ల క్రీడలకు ఆటంకం తప్పడం లేదు. ఎంతో ఆశగా ఆటలు ఆడుకునేందుకు క్రీడా మైదానానికి వచ్చిన విద్యార్థులు, చిన్నారులకు నీరుతో నిండిన మైదానాలు నిరాశ కలిగిస్తున్నాయి. నెల రోజుల నుంచి ప్రాంగణంలో నీళ్లు చేరినా తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో అటు విద్యార్థులు ఇటు ప్రజాసంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మైదానాల్లో చేరుకున్న నీటి తొలగింపునకు చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో వర్షం పడినా నీటి నిలువలు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని పట్టణ ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

### మోటార్లతో తోడిస్తాం

ప్రభుత్వ కళాశాలల్లో వర్షపు నీరు పేరుకుపోయింది. ఇటీవల మోటార్లు పెట్టి నీటిని తోడించాం. మళ్లీ వాన పడడంతో నీరు చేరింది. మోటార్లతో తోడిస్తాం. శాశ్వత పరిష్కార మార్గాలు అన్వేషించి చర్యలు చేపడతాం.

సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్



## ఫైలేరియా, జ్వరాలపై అవగాహన



భట్టిప్రోలు కొత్త విఠలేశ్వర నగర్ కాలనీ ఇళ్ల ఆవరణలో ఎబెట్ చల్లుతున్న ఆశా కార్యకర్తలు



కొత్త విఠలేశ్వరనగర్ కాలనీలో అవగాహన కల్పిస్తున్న రేపల్లె సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణయ్య తదితరులు

సాక్షి ఎఫెక్ట్

**భట్టిప్రోలు:** భట్టిప్రోలులో ఫైలేరియా ప్రబలుతుందన్న అంశంపై 'బోద'పడుతుందా శీర్షికన గురువారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. వైద్య ఆరోగ్య శాఖ రేపల్లె సబ్ యూనిట్ ఆఫీసర్ వైవీ కృష్ణయ్య శుక్రవారం భట్టిప్రోలు వచ్చారు. భట్టిప్రోలు కొత్త విఠలేశ్వరనగర్ కాలనీలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.ప్రసన్నబాబు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. ఫైలేరియా కేసులు, జ్వరాలపై ఆరా తీశారు. నీరు నిల్వ ఉంటే కలిగే అనర్థాలపై వివరించారు. ఇళ్ల ఆవరణలో నీరు చేరిన చోట ఆశా కార్యకర్తలు ఎబెట్ ద్రావణాన్ని చల్లారు. గత నెల రోజులుగా కాలనీ నుంచి నీరు తొలగకపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది ఆయిల్ బాల్స్, యంటీ లార్వా స్ప్రే చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వీరి వెంట ఏఎన్ఎంలు సీహెచ్ రత్నకుమారి, బి.నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

### 17న సర్వసభ్య సమావేశం

**కర్లపాలెం:** మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 17న ఉదయం 11 గంటలకు ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన నిర్వహిస్తామని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొంటారని ఎంపీడీఓ తెలిపారు.

## కుళాయిల నుంచి మురికినీరు





**రేపల్లె రూరల్:** పట్టణంలోని కుళాయిల నుంచి మూడు రోజులుగా రంగుమారిన మురికినీరు సరఫరా అవుతోంది. దుర్వాసన కూడా వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 22, 23, 24, 25వార్డులలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉన్నట్టు చెబుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు మాట్లాడుతూ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



## చోడాయపాలెం ఎస్ఐగా జ్యోతి బాధ్యతల స్వీకరణ



**రేపల్లె రూరల్:** చోడాయపాలెం ఎస్ఐగా జి.జ్యోతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరి సీటీఐ విభాగంలో ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ సాధారణ బదిలీపై ఆమె చోడాయపాలెం వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రాజ్యలక్ష్మి గుంటూరు వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ జ్యోతి మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని చెప్పారు. కార్యాలయ సిబ్బంది ఎస్ఐ జ్యోతికి శుభాకాంక్షలు తెలిపారు.

## రోడ్డుపై నీటి ప్రవాహం



**వేమూరు :** పెరవలి గ్రామంలో డ్రెయినేజీ పూడిపోవడంతో వర్షపు నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. చిన్న వర్షం పడినా నీరు నిలిచిపోతోంది. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి నీరు నిలవ ఉండి పోతోంది. దీంతో అంటువ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు బయటకు తరలించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.